## అగ్ని ప్రమాదాలు జరుగకుండా
# జాగ్రత్తగా ఉండాలి



గాంధారి ప్రభుత్వ దవాఖానలో కరపత్రాలను ప్రదర్శిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

కామారెడ్డి/ ఎల్లారెడ్డి/ మద్నూర్, ఏప్రిల్ 17: అగ్ని ప్రమాదాలు జరుగకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా ఉండాలని ఫైర్ సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం గాంధారిలోని ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానల్లో అగ్ని ప్రమాదాల నివారణ కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. గ్యాస్ సిలిండర్ వాడకంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ప్రశాంత్‌గౌడ్, టీవీ రాజు, శివ, నరేందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.
కామారెడ్డిలోని పలు కాలనీలు, దవాఖానల్లో అగ్ని ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది సయ్యద్ మహమూద్ అలీ మాట్లాడుతూ.. ప్రతి ఏడాది అగ్నిమాపక వారోత్సవాలను నిర్వహిస్తున్నామని అన్నారు.
మద్నూర్‌లోని ప్రభుత్వ దవాఖానలో ఫైర్ అధికారి వినోద్‌కుమార్ అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం సంభవిస్తే వెంటనే తమకు సమాచారం అందించాలన్నారు. వేసవిలో అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది నర్సింహులు, వెంకన్న, రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## ఏఎస్‌ఆర్ ఫౌండేషన్ కార్యవర్గం ఎన్నిక

బిచ్కుంద, ఏప్రిల్ 17: ఏఎస్‌ఆర్ ఫౌండేషన్ మండల కార్యవర్గాన్ని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అయ్యాల సంతోష్ ఆధ్వర్యంలో బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బాల్‌రాజ్, ప్రధాన కార్యదర్శిగా అనిల్, కోశాధికారిగా అహ్మద్‌ఖాన్, సలహాదారుడిగా ముజీబ్, సభ్యులుగా సచిన్, శంకర్, సతీశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బంగారు రవి, ఉపాధ్యక్షుడు రోటె సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## లింగంపేటలో ఎలుగుబంటి సంచారం

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 17: లింగంపేట గ్రామ శివారులో గల మత్తడి పోచమ్మ ఆలయ సమీపంలో మంగళవారం ఎలుగుబంటి కనిపించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రతి సంవత్సరం ఉగాది నుంచి ఐదు రోజుల పాటు మత్తడి పోచమ్మ ఆలయం వద్ద జాతర ఉంటుంది. ఉత్సవాలు ప్రారంభమైన నాటి నుంచి నెల రోజులపాటు ఆయా ప్రాంతాలకు చెందిన భక్తులు ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకుంటారు. ఈ క్రమంలో మంగళవారం లింగంపేట, ఐలాపూర్ గ్రామాలకు చెందిన పలువురు భక్తులు అమ్మవారిని దర్శించుకొని తిరిగి వెళ్తున్నారు. ఆలయ సమీపంలోని రహదారిపై ఎలుగుబంటి కనబడడంతో వారు ఆందోళనకు గురై అరుపులు, కేకలు వేశారు. దీంతో ఎలుగుబంటి సమీపంలోని గుట్టపైకి పారిపోయినట్లు వారు తెలిపారు. అటవీశాఖ అధికారులు స్పందించి ఎలుగుబంటిని పట్టుకోవాలని వారు కోరుతున్నారు.

## డీసీఎంను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

భిక్కనూరు, ఏప్రిల్ 17 : భిక్కనూరు మండలం ఎడ్లకట్టవాగుపై డీసీఎంను ఆర్టీసీ బస్సు ఢీకొన్నట్లు ఎస్సై సాయికుమార్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ నుంచి హైదరాబాద్ డిపోకు చెందిన రాజధాని బస్సు హైదరాబాద్‌కు వెళ్తున్నది. 44వ నంబర్ జాతీయ రహదారిపై ఉన్న టోల్‌గేట్ సమీపంలో ముందు వెళ్తున్న డీసీఎం డ్రైవర్ సడన్ బ్రేక్ వేశాడు. దీంతో డీసీఎంను ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో అద్దాలు ధ్వంసమయ్యాయి. బస్సులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. ప్రమాదానికి కారణమైన డీసీఎంను టోల్ ప్లాజా వద్ద ఉన్న సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నామని ఎస్సై తెలిపారు.

## అదుపుతప్పి పొదల్లోకి దూసుకెళ్లిన ఆర్టీసీ బస్సు

పిట్లం, ఏప్రిల్ 17: బాన్సువాడ ఆర్టీసీ డిపోనకు చెందిన బస్సు బుధవారం ఉదయం అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకుపోయింది. బస్సు బాన్సువాడ నుంచి పిట్లం వస్తుండగా కుర్తిగేట్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న ముళ్ల పొదల్లోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఎవరికీ ప్రమాదం జరుగలేదు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



కుర్తి గ్రామ సమీపంలో పొదల్లోకి దూసుకెళ్లిన బస్సు


నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

WANTED
★KFC Hiring P/F Time Jobs in Hyd. SSC Pass, 18 yrs Abv. M&F. 13k with Food & Accom. PF/ Medical/ Bonus/ Incentive. Ph: 9392526486, 9704449461, 8688442326.
NT-136-All

WANTED
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K Ph: 9640258899/9640468899
NT-311829

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.



# వేసవి దుక్కులకు వేళాయే..

- పెరుగనున్న భూసారం
- అధిక దిగుబడులకు ఆస్కారం
- చీడపీడలు, కలుపు మొక్కల నివారణ
- పంట సాగులో అద్భుత ఫలితాలు

**జిల్లాలో సాగు** భూముల్లో పోషకాలకు కొదువ లేదు. యాసంగి పంట సీజన్ ముగిసింది. పంటలు చేతికి వచ్చాయి. పొలాల్లోని కట్టెలు, చెత్తను రైతులు తొలగిస్తున్నారు. పొలాలను అలాగే వదిలేయకుండా లోతుగా దున్ని పెట్టుకుంటే ఎంతో మేలు జరుగుతుంది. భూమిని దున్నకుండా ఖాళీగా ఉంచితే కలుపు మొక్కలు పెరిగి నేలలోని పోషకాలు నశిస్తాయి. దీంతో భూసారం తగ్గి, పంట దిగుబడి పడిపోతుంది. వేసవి దుక్కులు, భూసార పరీక్షలు చేయించుకొని, వానకాలం పంటకు సిద్ధంగా ఉండాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

*– డోంగ్లీ, ఏప్రిల్ 17*

ఏ పంట వేయాలన్నా ముందుగా దుక్కి దున్నాల్సిందే.. విత్తడానికి, నాటడానికి అనుకూలంగా పొలాన్ని సిద్ధం చేసుకోవాల్సిందే. దుక్కి చేయకుండా వదిలేయడంతో భూమి సత్తువ కోల్పోతుంది. చీడపీడలకు ఆవాసంగా మారుతుంది. ముడి పోషకాల లోపం ఏర్పడి, తర్వాతి పంటకు భారీగా ఎరువులు వేయాల్సి వస్తుంది. వీటన్నింటి నివారణ కోసం వేసవిలో లోతు దుక్కుల మీద రైతులు దృష్టి పెట్టాల్సిన అవసరం ఉన్నది.

### చీడపీడలు, కలుపు నివారణకు చెక్...

ఎండకాలం చాలా వరకు భూమి ఖాళీగానే ఉంటుంది. ఈ సమయంలో గత పంటలను ఆశించిన అనేక రకాల పురుగులు వాటి నిద్రావస్థ దశలను నేల, చెత్త, చెదారం, కొయ్యకాడల్లో గడుపుతాయి. తెగుళ్లను కలుగజేసే శిలీంధ్రాలు భూమి లోపలి పొరల్లో ఆశ్రయం పొందుతాయి. వీటి శిలీంధ్ర బీజాలు భూమిలో నిల్వ ఉంటాయి. వేసవి దుక్కులతో నిద్రావస్థ దశలో ఉన్న చీడ పురుగుల కోశాలు, గుడ్లు, లార్వాలు బయటపడతాయి. వాటిని పక్షులు, కొంగలు, ఇతర పక్షులు తిని నాశనం చేస్తాయి. లోతుగా దున్నడంతో భూమి లోపలి పొరల్లో ఉన్న శిలీంధ్ర బీజాలు మట్టితోపాటు నేలపైకి వస్తాయి. బయటి అధిక ఉష్ణోగ్రతలకు చనిపోతాయి. ఇలా వేసవి దుక్కులతో రాబోయే పంటలను ఆశించి చీడపీడలకు చెక్ పెట్టవచ్చు. అదేవిధంగా వేసవిలో భూములను వదిలేస్తే కలుపు మొక్కలు విపరీతంగా పెరుగుతాయి. రాబోయే పంట సమయంలో కలుపు నివారణ కష్టతరమవుతుంది. పంట లేని సమయంలో పెరిగే కలుపు మొక్కలు భూమిలోని నీరు, పోషకాలను ప్రత్యక్షంగా గ్రహిస్తాయి. ఫలితంగా వచ్చే పంట దిగుబడి తగ్గుతుంది. వేసవి లోతు దుక్కులతో పాతుకుపోయిన కలుపు మొక్కలు, వాటి విత్తనాలను సమూలంగా నిర్మూలించవచ్చు.

### మూడు రకాలుగా దున్నుకోవాలి..

వేసవి దుక్కులను లోతుగా, వాలుకు, అడ్డంగా దున్నుకోవాలి. వాలుకు అడ్డంగా దున్నుకోవడంతో వాననీరు భూమిలోకి ఇంకేందుకు అనుకూల పరిస్థితి ఏర్పడుతుంది. భూమి కూడా ఎక్కువ తేమను గ్రహిస్తుంది. నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. వేసవి దుక్కులకు ముం దు పొలంలో గొర్రెలు, పశువుల మందలు తోలడంతో వాటి విసర్జక వ్యర్థాలు సేంద్రియ ఎరువుగా మారి భూమిలోకి చేరుతాయి. భూసార వృద్ధికి తోడ్పడుతాయి. గత పంటకు సంబంధించిన ఆకులు, మొదళ్లు, చెత్తా చెదారం నేల పొరల్లో కలిసిపోయి, ఎరువుగా మారుతాయి. రాబోయే పంటకు కావాల్సిన పోషక పదార్థాలను అందిస్తాయి.

### అధిక దిగుబడులకు ఆస్కారం..

వేసవిలో లోతు దుక్కులు దున్నడం ద్వారా భూమిలోపల ఉన్న హానికర పురుగులు, శిలీంధ్రాలు నశిస్తాయి. వర్షపు నీరు భూమిలోకి ఎక్కువగా ఇంకుతుంది. భూమి పొరల్లో తేమ పెరుగుతుంది. ఆ తర్వాత వేసే పంట వేరు వ్యవస్థ లోపలి పొరల్లోకి చొచ్చుకెళ్తుంది. దీంతో పైరుకు రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. వర్షాలకు ముందే భూమిని దున్నడంతో తొలకరి వర్షపు నీరు భూమిలోకి ఇంకుతుంది. భూమి కోతను నివారిస్తుంది. లోతు దుక్కులతో భూమి పైపొరలు కిందికి, కింది పొరలు పైకి తిరగబడి, నేల సారవంతంగా తయారవుతుంది. భూమిలోని తేమశాతం పెరిగి, భూసారం అభివృద్ధి చెందుతుంది. వేసవి దుక్కులకు ముందు పొలంలో పశువుల పెంట, కంపోస్టు ఎరువులు, చెరువులు, కుంటల్లోని మట్టిని వెదజల్లడం ద్వారా భూసారం మరింత పెరుగుతుంది. రాబోయే పంటల్లో అధిక దిగుబడులకు ఆస్కారం ఉంటుంది.



### లోతు దుక్కులు అవసరమే..

యాసంగి కోతల తర్వాత చాలామంది రైతులు భూమిని అలాగే వదిలేస్తారు. దీంతో ఖాళీ భూముల్లో కలుపు, ఇతర గడ్డిజాతి మొక్కలు పెరుగుతాయి. ఇవి భూమిలోని నీటిని, పోషక పదార్థాలను గ్రహిస్తాయి. భూమికి సత్తువ లేకుండా చేసి భూసారాన్ని తగ్గిస్తాయి. భూమి లోపలి పొరల్లోని నీరు ఆవిరైపోతుంది. వేసవి దుక్కులు లేకుంటే తొలకరి వాననీరు భూమిలోకి ఇంకకుండా పోతుంది. వర్షాలతో భూమి కోతకు గురవుతుంది. ఖాళీ భూముల్లో చీడపీడలు భారీగా వృద్ధి చెందుతాయి. ఫలితంగా పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుంది.

### దుక్కులతో తెగుళ్ల నివారణ

పంటల కోత అనంతరం అనేక పురుగులు నేల, కొయ్యకాడల్లో గడుపుతాయి. లోతుగా దున్నితే నిద్రావస్థలో ఉన్న పురుగులు, లార్వాలు బయటికి వచ్చి అధిక ఉష్ణోగ్రతకు చనిపోతాయి. లోపలిపొరల్లో ఉన్న శిలీంధ్రాలు కూడా మట్టితోపాటు పైకి రావడంతో వేడికి గురై తెగుళ్లను కలుగజేసే శక్తిని కోల్పోతాయి.

*- రాజు, ఏవో, డోంగ్లీ/మద్నూర్*



# కమనీయం.. రాములోరి కల్యాణం



బాన్సువాడలో శోభాయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి



బిచ్కుందలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే

- స్వామి వారికి పట్టు వస్త్రాల సమర్పణ
- భక్తులకు అన్నదానం

నమస్తే తెలంగాణ యంత్రాంగం, ఏప్రిల్ 17: శ్రీరామనవమి వేడుకలను జిల్లావ్యాప్తంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. మందిరాల్లో పచ్చని పందిళ్లు వేసి అలంకరించారు. ఆలయాల్లో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు కొనసాగాయి. స్వామి వారి ఉత్సవ విగ్రహాలకు పల్లకీ సేవ నిర్వహించారు. మధ్నాహ్నం 12 గంటలకు సీతారాముల కల్యాణాన్ని వేద పండితులు కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి వారికి పలువురు ఆలయ కమిటీ బాధ్యులు, ప్రజా ప్రతినిధులు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. మహిళలు ఒడి బియ్యం పోసి మొక్కులను చెల్లించుకున్నారు. వివాహం అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. బాన్సువాడలోని శ్రీరామ కాలనీలో ఉన్న రామాలయాన్ని మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి దంపతులు, బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం భాస్కర్‌రెడ్డి దర్శించుకున్నారు.
బాన్సువాడ మండలం పోచారం, దేశాయిపేట్, తిర్మలాపూర్, కొల్లూరు గ్రామాల్లోని రామాలయాల్లో నిర్వహించిన సీతారాముల కల్యాణ మహోత్సవంలో మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్, బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పోచారం భాస్కర్‌రెడ్డిలు సతీసమేతంగా పాల్గొన్నారు. పిట్లంలోని రామాలయంలో నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. మద్నూర్ రామాలయం, సలాబత్‌పూర్ ఆంజనేయ స్వామి ఆలయాల్లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, జహీరాబాద్ ఎంపీ బీబీపాటిల్ తదితరులు పాల్గొన్నారు.
బిచ్కుందలోని రామాలయానికి ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సమర్పించారు. బిచ్కుంద రామాలయంలో మాజీ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎల్లారెడ్డిలోని కోదండ రామాలయాన్ని ఎంపీ బీబీ పాటిల్ దర్శించుకున్నారు. రామారెడ్డిలో నిర్వహించిన సీతారామచంద్రస్వామి కల్యాణంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు పాల్గొన్నారు.



పిట్లం: శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు



రామారెడ్డిలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొన్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు



ఎల్లారెడ్డిలోని కోదండ రామాలయంలో పూజలు చేస్తున్న ఎంపీ బీబీ పాటిల్

# అదుపుతప్పితే అంతే..

- బస్సుల కొరతతో ప్రమాదపుటంచున ప్రయాణం
- పట్టించుకోని అధికారులు

పిట్లం, ఏప్రిల్ 17: మండల కేంద్రం నుంచి బాన్సువాడ వెళ్లడానికి ఆర్టీసీ బస్సుల కొరత ఏర్పడుతున్నది. ప్రయాణికులు నిత్యం ప్రమాదపుటంచున పయణించాల్సి వస్తున్నది. పిట్లం నుంచి బాన్సువాడ వెళ్లే బస్సులో ప్రతిరోజూ ఉదయం విద్యార్థులు, ఇతరులు ఫుట్‌బోర్డ్‌పై వేలాడుతూ ప్రయాణం చేస్తున్నారు. ప్రమాదాలు జరుగకముందే ఆర్టీసీ అధికారులు స్పందించి పిట్లం – బాన్సువాడకు మరిన్ని బస్సు సర్వీసులను నడిపించాలని ప్రజలు కోరుతున్నారు.



ఫుట్‌బోర్డ్‌పై ప్రయాణం చేస్తున్న ప్రయాణికులు, విద్యార్థులు

## ఇసుక ట్రాక్టర్ సీజ్

మాచారెడ్డి, ఏప్రిల్ 17 : అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. పాల్వంచ మండలంలోని వాగు నుంచి అక్రమంగా ఇసుకను తవ్వుతూ ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు దాడులు నిర్వహించగా ఇసుకతోపాటు ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఎస్సై వివరించారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఎల్వోసీ చెక్కు అందజేత



ఎల్వోసీని అందజేస్తున్న మాజీ మంత్రి షబ్బీర్ అలీ

బీబీపేట్, ఏప్రిల్ 17: మండల కేంద్రానికి చెందిన తేలు ప్రశాంత్‌కు కంటి సమస్య రావడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ప్రభుత్వ సలహాదారుడు మాజీ మంత్రి షబ్బీర్ అలీ బుధవారం రూ. 4.50 లక్షల ఎల్వోసీని బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రమేశ్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## లిటిల్ స్కాలర్స్ పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే



పట్టాలు అందుకున్న చిన్నారులు

కామారెడ్డి, ఏప్రిల్ 17 : జిల్లా కేంద్రంలోని లిటిల్ స్కాలర్స్ హైస్కూల్ మంగళవారం రాత్రి గ్రాడ్యుయేషన్ డేను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ సింధూశర్మ హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. చిన్నారుల చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ పున్న రాజేశ్, పున్న అరుణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కోనాపూర్‌లో అఖండ హరినామ సప్తాహం

బాన్సువాడ రూరల్, ఏప్రిల్ 17 : మండలంలోని కోనాపూర్ గ్రామంలో అఖండ హరినామ సప్తాహం కొనసాగుతున్నది. బుధవారం హన్మాండ్లు మహారాజ్ ఆధ్వర్యంలో హరినామ సప్తాహం, కీర్తనలు కొనసాగాయి. ఉదయం 10 గంటల నుంచి రాత్రి వరకు భజన, ప్రవచనాలు, హరిపాఠ్, హరికీర్తన, కాకడ హారతి కార్యక్రమాలు నిర్వహించారు. సప్తాహంలో మాజీ సర్పంచ్ వెంకటరమణారావు దేశ్‌ముఖ్, కిషన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.